

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను గృహనిర్బంధం చేసిన పేట్ బషీరాబాద్ పోలీసులు

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 7 డిసెంబర్ 2024 | HYDERABAD



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో హౌస్ అరెస్టు చేసిన కుషాయిగూడ పోలీసులు

# ప్రజాపాలనలో నిర్బంధకాండ

## బీఆర్‌ఎస్ నేతలను గడప దాటనివ్వని ప్రభుత్వం.. సర్కారు తీరుపై గులాబీ శ్రేణుల ఆగ్రహం



గృహనిర్బంధంలో ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు తదితరులు



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను అడ్డుకున్న పోలీసులు



బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ) : కాంగ్రెస్ ప్రభుత్వం స్వేచ్ఛను హరిస్తున్నది. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు, అరెస్టులకు వ్యతిరేకంగా ట్యాంక్ బండ్ వద్ద డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ట్యాంక్ బండ్‌పై బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం చేపట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలను అక్రమంగా అరెస్టులు చేయడంతో పాటు గృహ నిర్బంధంలో ఉంచారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇతర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను అడుగడుగునా గృహ నిర్బంధం చేశారు. ప్రజాపాలన పేరుతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం... బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను, కార్పొరేటర్లను అక్రమంగా నిర్బంధించడం దేనికి సంకేతమని, అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమానికి.. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేగా తనకు ఆహ్వానం పలకాల్సింది పోయి..నిర్బంధం చేయడం ఏమిటని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై పోరాడుతుంటే...కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఇబ్బందులు పెడుతున్నదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన విధంగా గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఎందరినీ నిర్బంధించినా.. ప్రజలకు అండగా ఉండి పోరాడుతుందని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు స్పష్టం చేశారు.




మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల మోహరింపు



టకారాబస్తీలోని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఇంటి ముందు పోలీసుల గస్తీ



కూకట్‌పల్లిలో గృహ నిర్బంధంలో ఎమ్మెల్యే కృష్ణారావు

# యాప్రాల్‌లో హైడ్రా కూల్చివేతలు



సిటీబ్యూరో/నేరేడ్‌మెట్:జవహర్‌నగర్‌లోని యాప్రాల్‌లో శుక్రవారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. బఫర్‌జోన్‌లో నిర్మించిన డోకూరి నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కొంతభాగాన్ని, ప్రహరీని నేలమట్టం చేశారు. నాగిరెడ్డి కుంట నాలాను ఆనుకొని ఉన్న బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులొచ్చాయి. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ విభాగాల అధికారులు విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 14,32 లోని ప్రభుత్వ భూమిలోకి జరిగి డీఎన్‌ఆర్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం జరిగినట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్లలో నిర్మాణం చేపట్టి ప్రైవేటు స్థలానికి చెందిన సర్వే నంబర్‌లో నిర్మించినట్లుగా కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిన నిర్మాణదారుడు స్టేటస్‌కో ఆర్డర్ తెచ్చుకున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. మరోవైపు ఫంక్షన్‌హాల్ మొత్తం స్టేటస్ కో ఉన్నదంటూ అధికారులను తప్పుదోవ పట్టించారని వారు పేర్కొన్నారు. హైడ్రా విచారణలో ఈ భూమి ప్రభుత్వ భూమిగా తేలడంతో కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి సర్వే నంబర్లు 14,32 పరిధిలోకి వచ్చిన ఫంక్షన్‌హాల్‌లోని కొంత భాగాన్ని, కాంపౌండ్ వాల్‌ను హైడ్రా బృందం కూల్చేసింది. నాగిరెడ్డి కుంట బఫర్‌జోన్‌లో నాలాకు ఆనుకొని ఉన్న భూమిలో ఫంక్షన్‌హాల్ నిర్మించినందుకు వాటిని కూల్చేశామని అధికారులు తెలిపారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్న సర్వే నంబర్ 25లో కూల్చివేతలు చేపట్టలేదని వారు స్పష్టం చేశారు. సర్వే నంబర్ 32లో ధోబీఘాట్‌ను కబ్జా చేసేందుకు చేసిన ప్రయత్నాలను కూడా హైడ్రా అడ్డుకుంది.

# మలక్‌పేట మెట్రో వద్ద బైకుల దగ్ధం

### ఉలిక్కిపడ్డ ప్రయాణికులు..పెట్రోల్ దొంగలపనేనన్న పోలీసులు

మలక్‌పేట: మలక్‌పేట మెట్రోస్టేషన్ మెట్ల కింద పార్కు చేసిన ఐదు బైకులకు నిప్పంటుకోవడంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దట్టమైన పొగలు మెట్రోస్టేషన్‌ను పూర్తిగా కమ్మేయడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో నిత్యం స్టేషన్ మెట్ల కింద ప్రయాణికులు తమ ద్విచక్రవాహనాలను పార్కు చేసి వెళ్తుంటారు. అయితే రోజు మాదిరిగానే పార్కు చేసిన వాహనాలకు శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు మెట్రోస్టేషన్‌ను కమ్మేయడంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు, మెట్రో అధికారులు చాదర్‌ఘాట్ పోలీసులకు, మలక్‌పేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే ఫైరింజన్‌తో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే ఐదు బైకులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనతో మలక్‌పేట-దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. కాగా, మెట్రో స్టేషన్ కింద పార్కు చేసిన వాహనాల నుంచి దొంగలు పెట్రోల్ దొంగిలిస్తుంటారని, పెట్రోల్‌ను దొంగిలించే క్రమంలోనే ఈ ఘటన జరిగి ఉంటుందని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.



# చెరువుల సుందరీకరణపై పట్టింపేదీ?

### కేసీఆర్ ప్రభుత్వంలో బ్యూటిఫికేషన్‌కు రూ.271.33 కోట్లు కేటాయింపు

### ఏడాది కాలంగా పనుల్లో పురోగతి చూపని కాంగ్రెస్ సర్కారు

### రూ.60.86 కోట్లతో నత్తనడకన 34 చోట్ల పనులు

సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ) : చెరువుల రక్షణలోనే కాదు...సుందరీకరణ పనుల్లోనూ జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వహిస్తోంది. చెరువుల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా విభాగాన్ని ఏర్పాటు చేశామని ఒక వైపు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేక కబ్జాదారులకు అధికారులు వంత పాడుతున్నారు. చేతిలో ఉన్న నిధులతో పరిరక్షణ, సుందరీకరణ పనులు చేపట్టి మినీ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు.. గడిచిన ఏడాది కాలంగా పనులపై పురోగతి చూపించడం లేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న 185 చెరువుల కాపాడి పరిసరాలను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్‌ఎంసీ సుందరీకరణ పనులను అటకెక్కించింది. చుట్టూ బండ్, వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి మురుగు నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో దుర్వాసనతో స్థానికులు అవస్థలుపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే చెరువు సుందరీకరణ పనులు నిలిచిపోవడంపై బల్దియాకు ఫిర్యాదులు వెలువెత్తాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో తొలి విడతగా 20 చెరువులను గత కేసీఆర్ ప్రభుత్వం సుందరీకరణ పనులను రూ. 271.33 కోట్లతో చేపట్టింది. అయితే కొత్త ప్రభుత్వం వచ్చాక చెరువుల సుందరీకరణ పనులు ఏ మాత్రం ముందుకు కదలడం లేదు. రూ. 60.86కోట్లతో 34 చోట్ల చేపట్టిన పనుల్లో పెద్దగా పురోగతి లేకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం.



**చెరువుల అభివృద్ధి పనుల వివరాలు**

| జోన్ | పనులు మొత్తం | పూర్తి చేసినవి | పురోగతిలో ఉన్నవి | టెండర్ దశలో |
|---|---|---|---|---|
| చార్మినార్ | 2 | 1 | 1 | 0 |
| ఖైరతాబాద్ | 4 | 0 | 4 | 0 |
| కూకట్‌పల్లి | 10 | 2 | 8 | 0 |
| ఎల్బీనగర్ | 5 | 1 | 3 | 1 |
| సికింద్రాబాద్ | 1 | 1 | 0 | 0 |
| శేరిలింగంపల్లి | 12 | 5 | 2 | 3 |

## రాత్రి 8 గంటలకే..

### సిటీలోకి భారీ వాహనాలు..

సిటీబ్యూరో: రాత్రి 8 గంటలకే నగరంలోకి భారీ వాహనాలు ఎంట్రీ ఇస్తున్నాయి. సిటీలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో భాగంగా రాత్రి 10 గంటల తరువాతే భారీ వాహనాలకు అనుమతి ఉంది. అయితే ట్రాఫిక్ పోలీసులు రాత్రి 8 గంటల వరకే రోడ్లపై ఉండడంతో భారీ వాహనాలు సిటీలోకి ప్రవేశిస్తున్నాయి.

**నో ఎంట్రీ సమయంలో...**

సిటీలోకి భారీ వాహనాలు వస్తే, చలాన్లు వేయడంతో పాటు రాత్రి 10 గంటల వరకు సమీపంలోని ఓపెన్ ప్లేస్‌లో ఆ వాహనాలను ఆపుతామంటూ గతంలో ఉన్నతాధికారులు ప్రణాళికలు చేశారు. వారం రోజుల పాటు రాత్రి వేళల్లో భారీ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా రాకుండా కట్టడి చేసినట్లు క్షేత్రస్థాయిలోని పోలీసులు చర్యలు తీసుకొని ఆ తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారనే విమర్శలొస్తున్నాయి. ఇంకేముంది రాత్రి 8 తరువాత అసలు ట్రాఫిక్‌కు, భారీ వాహనాలు కూడా తోడవ్వడంతో రద్దీ ఏర్పడుతున్నది.

**రాత్రి 10 వరకు..**

లారీలు, ప్రైవేట్ బస్సులు రాత్రి 10 గంటల వరకు నగరంలోకి ప్రవేశానికి అనుమతి లేదు. అయితే చాలా వరకు ప్రైవేటు బస్సులు నిబంధనలు ఉల్లంఘిస్తూ రాత్రి 8 నుంచి 9 గంటల మధ్యలోనే నగరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ విషయంపై కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ పోలీసులు చలాన్లు రాసినా.. భారీ వాహనదారులు ఏ మాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారు.

# ఎక్సైజ్ లక్ష్యం ఫామ్ హౌస్‌లే

### నిబంధనల పేరుతో వేధింపులు

సిటీబ్యూరో: ఫామ్‌హౌస్‌లే లక్ష్యంగా కొందరు ఆబ్కారీ అధికారులు మామూళ్ల కోసం వేటాడుతున్నారు. ప్రభుత్వ ఖజానా నింపడంలో కీలక పాత్ర పోషించే ఆబ్కారీ అధికారులు జేబులు నింపుకోవడంలో కూడా తమ మార్క్‌ను ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను బూచీగా చూపిస్తూ అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా శంషాబాద్, చేవెళ్ల, శామీర్‌పేట, మేడ్చల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న ఫామ్‌హౌస్‌లను లక్ష్యంగా చేసుకొని కొందరు ఎక్సైజ్ పోలీసులు మామూళ్ల కోసం వేధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కేసులు పెట్టి..



ఫామ్‌హౌస్‌లలో ఒక్క మద్యం బాటిల్‌ను వినియోగించినా.. ఆబ్కారీ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలనే నిబంధన కొందరు అధికారులు, సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తున్నది. అయితే చారాణ కోడికి బారాణ మసాల అన్నట్లు నలుగురైదుగురు కలిసి రూ.2వేల విలువ చేసే ఒక మద్యం బాటిల్‌తో ఫామ్‌హౌస్‌లో చిన్నపాటి పార్టీ చేసుకుంటే దానికి రూ.9వేలు పెట్టి లైసెన్స్ తీసుకోవడం ఏమిటని అటు వినియోగదారులు, ఇటు ఫామ్‌హౌస్ నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిబంధనను ఆసరాగా చేసుకుని కొందరు ఆబ్కారీ అధికారులు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వకపోతే కేసులు నమోదు చేస్తున్నట్లు ఫామ్‌హౌస్‌ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

### కుదిరిన ఒప్పందాలు

రెండు మూడు నెలల కిందట వరకు ఫామ్‌హౌస్‌లపై దాడులతో హడావిడి చేసిన కొందరు ఆబ్కారీ అధికారులు మొత్తానికి నిర్వాహకులను దారిలోకి తెచ్చుకుని ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలవారీ ఒప్పందాలు కుదరడంతోనే సదరు అధికారులు ఇప్పుడు ఫామ్‌హౌస్‌ల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వారాంతంలో ఫామ్‌హౌస్‌లలో ఎక్కువగా 5 నుంచి 10మంది సభ్యులతో కూడిన పార్టీలు జరుగుతాయని, అందులో రెండు నుంచి మూడు వరకు మద్యం బాటిళ్లు మాత్రమే వినియోగిస్తారని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే చిన్న చిన్న పార్టీలు చేసుకునే వినియోగదారులు ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకునేందుకు నిరాకరిస్తున్నారని, ఎందుకంటే వారు వినియోగించే రెండు మూడు వేల మద్యం కోసం రూ.9వేలు వెచ్చించి అనుమతి తీసుకోవాలా అని ప్రశ్నిస్తున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. అడపాదడపా జరిగే పెద్ద పార్టీలతో గిట్టుబాటు లేక చిన్న పార్టీలకు అవకాశం కల్పించక తప్పడం లేదని ఫామ్‌హౌస్‌ల నిర్వాహకులు వాపోతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని సంబంధిత అధికారులు మామూళ్ల కోసం వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులకు, ఇటు సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు, మరో వైపు ఎస్‌వోటీ పోలీసులు, ఎస్టీఎఫ్, డీటీఎఫ్ తదితర టీమ్‌లకు చెందిన పలువురు పోలీసు అధికారులకు మామూళ్లు ఇచ్చుకోలేని నిర్వాహకులు శివారు ప్రాంతాల్లో ఉన్న తమ ఫామ్‌హౌస్‌లను మూసివేస్తున్నారు.